ప్రజాశక్తి

గురువారం 22 డిసెంబర్ 2022 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి బాబురెడ్డి

ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం

నిరంకుశ ధోరణితో వ్యవహరిస్తోంది..

పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బాబురెడ్డి ధ్వజం

ప్రజాశక్తి-టంగుటూరు

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకుండా నిరంకుశ ధోరణితో వ్యవహరిస్తోందని, ఇది ప్రభుత్వ మోసకారితనానికి నిదర్శమని తూర్పు రాయలసీమ పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి. బాబురెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం మండలంలోని పది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సందర్శించి.. ఉపాధ్యాయ ఓటర్లను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా బాబురెడ్డి మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రిని కలిసినప్పుడు వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు కుదరదని ▶ 2లో



తలసేమియా బాధితురాలి

తక్షణ చికిత్సకు సాయం ▶ 8లో

ప్రతి ఏటా ట్యాబ్‌లు ఇస్తాం..

- వీటి వల్ల మంచే జరుగుతుంది..
- ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి
- ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబుల పంపిణీ ప్రారంభం



సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

'ఈ సంవత్సరం నుంచి ఇక మీదట ప్రతి ఏటా ఎనిమిదో తరగతిలోకి వచ్చే ప్రతి బాబు, పాపకు ఈ ట్యాబులు ఇస్తూ పోతాం. ఇది ఒక్కసారి నా పుట్టినరోజు సందర్భంగా జరుగుతున్నది కాదు. ఈ రోజు వేసే బీజం ప్రతి సంవత్సరం చిన్నారులకు 8వ తరగతిలో అడుగు పెడుతూనే ట్యాబులు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం.' అని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బాపట్ల జిల్లా, చుండూరు మండలం, యడ్లపల్లిలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబుల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైయస్. జగన్‌మోహనరెడ్డి బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెట్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న 4,59,564 మంది విద్యార్థులు, 59,176 మంది ఉపాధ్యాయులకు రూ.778 కోట్ల బైజూస్ ప్రీలోడెడ్ కంటెంట్, రూ 686 కోట్ల విలువైన 5,18,740 శామ్‌సంగ్ ట్యాబులు ఉచిత పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ మాట్లాడుతూ రకరకాల కారణాల వల్ల తమ కులం కారణంగానో, ఆర్థిక స్తోమత కారణంగానో తమ పిల్లలను సరిగ్గా చదివించుకోలేమని.. వాళ్ల భవిష్యత్తుకు సరిగ్గా బాటలు వేయలేకపోతున్నామని తల్లిదండ్రులు ఎప్పుడైనా భావించినప్పుడు వాళ్ల మనస్సులు ఎలా తల్లడిల్లుపోతాయన్నది ఓదార్పు యాత్ర నుంచి పాదయాత్ర వరకు తాను కళ్లారా చూశానన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ మూడున్నర సంవత్సరాల కాలంలో మన రాష్ట్రంలో ప్రతి పాప, ప్రతి బాబు బాగా చదివేందుకు వీలుగా వారి భవిష్యత్తును తీర్చిదిద్దేలా ఈ ప్రభుత్వం చాలా కార్యక్రమాలు చేపట్టిందన్నారు. తరాలు మారుతున్నా కొన్ని వర్గాల తలరాతల మారకూడదనన్న పెత్తందారుల భావాలను బద్దలకొడుతూ.. రాష్ట్రంలోని గవర్నమెంటు బడుల్లో ఒక డిజిటల్ విప్లవానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ రోజు తన పుట్టినరోజు గురించి కాదని, ఈ తరం బిడ్డల గురించి మాట్లాడుతున్నానని చెప్పారు. ఈ రోజు రూ 686 కోట్లతో 5,18,740 ట్యాబులను పంపిణీ చేస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని నా దళిత సోదరుడి నియోజకవర్గంలో ప్రారంభిస్తున్నానని పేర్కొన్నారు. మనం ఇచ్చే టెక్నాలజీ వల్ల పిల్లలకు మంచి జరగాలి తప్ప చెడు జరక్కూడదన్నారు. ఇదే ఆలోచనతో ట్యాబులో సెక్యూర్డ్ మొబైల్ డివైజ్ మేనేజిమెంట్ (ఎండీఎం) సాఫ్ట్‌వేర్ పెట్టారని, దీనివల్ల ట్యాబుల్లో పాఠాలు, లెర్నింగ్‌కు సంబంధించిన అంశాలు మాత్రమే చూడగలుగుతారని చెప్పారు. ప్రభుత్వ ▶ 2లో



ట్యాబ్‌లో విద్యార్థులతో కలిసి సెల్ఫీ దిగుతున్న సిఎం జగన్

పంటను పీకేస్తున్నారు..

- మాండూస్ దెబ్బకు పొగాకు రైతులు విలవిల
- పెట్టుబడిలోనూ ఒక్క రూపాయి కూడా రాని పరిస్థితి
- దెబ్బతిన్న పొగతోటలను పీకేస్తున్న రైతులు
- తిరిగి నాట్లు వేస్తున్న వైనం



దెబ్బతిన్న పొగాకు పంటను పీకేస్తున్న కూలీలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు, టంగుటూరు

మాండూస్ తుపాన్ దెబ్బకు పొగాకు రైతులు నష్టాలపాలయ్యారు. భారీవర్షాల కారణంగా పంటలన్నీ కోల్పోయారు. ఒక్కో రైతు రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టినా.. ఒక్క రూపాయి కూడా తిరిగి రాని పరిస్థితి నెలకొంది. తుపాన్‌కు దెబ్బతిన్న పొగాకు పంటను రైతులు పీకేస్తున్నారు. మళ్లీ పొగ నాట్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

పొగాకు ధరలు ఆశాజనంగా ఉండటంతో నాగులుప్పలపాడు మండలంలో ఐదు వేల హెక్టార్లలో, టంగుటూరు పొగాకు బోర్డు పరిధిలో 5300 హెక్టార్లలో ఈ ఏడాది పొగాకు చేశారు. గత ఏడాది పొగాకు ఉత్పత్తి కొంత తక్కువగా ఉండటం, అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ బాగా ఉండటంతో లోగ్రేడ్ పొగాకును కూడా క్వింటాకు రూ.1300 నుండి రూ.1500 దాకా అత్యధిక ధరతో బోర్డు అధికారులు కొనుగోలు చేశారు. ఈ ధరలను పోల్చుకున్న రైతులు ఈ ఏడాది ఎంతో ఆనందంతో పొగాకు సాగును ఒక్క బ్యారన్ కూడా వదలకుండా బంధువుల పేర్లతోనూ పొగాకు పంట సాగు చేపట్టారు. ఎకరాకు రూ.50 వేల నుండి రూ.80 వేల దాకా పెట్టుబడులను అంతా పొగాకు మీదనే పెట్టారు. చేలలో రోజూ పొగాకును చూసి ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులకు మాండూస్ తుపాను తీవ్రనష్టం మిగిల్చింది. నాలుగు రోజుల పాటు ఎడతెరిపి లేని వానలతో పొగాకు పంటలన్నీ నీట మునిగాయి. వర్షాలు తగ్గిన తర్వాత రోజులు గడిచినప్పటికీ పొగాకు రోజు రోజుకూ ఉరకెత్తి మొక్కలన్నీ చేలలోనే నేల వాలాయి. ఇది చూసిన రైతుల ఆవేదన అంతా ఇంతా కాదు. దీంతోనే ప్రస్తుతం పొగాకు రైతులు ▶ 2లో

నిరంకుశధోరణితో వ్యవహరిస్తోంది..

(మొదటిపేజీ తరువాయి)

చెప్పడాన్ని బాబురెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రతినెలా ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితిలో ఈ ప్రభుత్వం ఉందని, డిఏ బకాయిలు అడిగితే ఇవ్వకపోగా ఉన్నవి తీసేస్తున్నారని విమర్శించారు. చివరకు ఉపాధ్యాయులు దాచుకున్న పిఎఫ్, ఏపీజిఎల్ఐలను కూడా ఇవ్వకుండా ఈ ప్రభుత్వం వేధిస్తుందని దుయ్యబట్టారు. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని, మొదటి ప్రాధాన్యత ఓటు తనకు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.రవి, మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.రమేష్‌బాబు, కె.పూర్ణశ్రీ, ఉపాధ్యాయులు ఎస్.ప్రసాద్, ప్రవీణ్, విశ్రాంత ఉపాధ్యాయులు నారాయణ పాల్గొన్నారు.

ప్రతి ఏటా ట్యాబ్‌లు ఇస్తాం..

(మొదటిపేజీ తరువాయి)

పాఠశాలల్లో ఆరోతరగతి నుంచి పై తరగతి వరకూ ప్రతి సెక్షన్‌లోనూ డిజిటల్ క్లాస్‌రూమ్స్ కాబోతున్నాయన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

కృష్ణానది మీద ఓలేరు–తూర్పు పాలెం గ్రామాలు, భట్టిప్రోలు మండలంలో 4.96 టీఎంసీల సామర్థ్యంతో రూ.2500 కోట్లతో బ్యారేజీ నిర్మాణ పనుల కోసం అడిగారని, ఏప్రిల్ నుంచి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు కూడా మొదలవుతాయని సిఎం చెప్పారు. జంపని షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగుల సమస్య పరిష్కారం కోసం అడిగారని, వీళ్లకు న్యాయం చేస్తామన్నారు. రూ 17.6 కోట్లతో రోడ్ల నిర్మాణం కోసం పీఎంజీఎస్‌వై కింద మంజూరు చేస్తున్నామన్నారు. 1811 ఎకరాల సాగు చేస్తున్న కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో 10 గ్రామాల్లో 3749 రైతులకు సంబంధించిన లంక భూములకు వారికి పట్టాలు ఇప్పించే కార్యక్రమం చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం సమావేశం జరుగుతున్న ఏవీఆర్ జడ్పీ హైస్కూల్‌లో ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులు కూడా యాడ్ చేసేందుకు హామీ ఇస్తున్నానని సిఎం చెప్పారు.

సభా వేదికపై సిఎంతో పాటు సాంఘిక సంక్షేమ మంత్రి మేరుగ నాగార్జున, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, వైసిపి నెల్లూరు, చిత్తూరు, కడప రీజనల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ సురేష్, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బీదా మస్తాన్‌రావు, కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్సీ మాధవరావు, కల్పలత, పోతుల సునీత పాల్గొన్నారు.

పంటను పీకేస్తున్నారు..

(మొదటిపేజీ తరువాయి)

దెబ్బతిన్న పంటను పీకేస్తున్నారు. మళ్లీ కొత్త ఆశలతో నాట్లు వేస్తున్నారు.

23 ఎకరాలలో పంట పీకేశా..

పొద కన్నా, అగ్రహారం, నాగులుప్పలపాడు

నేను 23 ఎకరాల్లో పొగాకు పంట సాగు చేశా.. ఇంకా రెండు రోజుల్లో కొట్టుకువస్తుందనుకున్న సమయంలో భారీ వర్షాలు కొంపముంచాయి. దీంతో పంట మొత్తం దెబ్బతినడంతో.. ఆ మొక్కలన్నీ పీకేసి.. మళ్లీ నాట్లు వేస్తున్నాం.

12 ఎకరాల్లో పంట దెబ్బతింది..

డాకా శ్రీనివాసరెడ్డి, నిడమానూరు

అధిక వర్షాలకు 12 ఎకరాల్లో పొగాకు పంట దెబ్బతింది. మొత్తం పీకేసి.. మళ్లీ నాట్లు తెచ్చి.. నాటుతున్నాం.. దీనికి తిరిగి ఎకరానికి అదనంగా 15 వేల దాకా ఖర్చవుతుంది. సేద్యం ఆలస్యమవడంతో నాణ్యత తగ్గే అవకాశం ఉంది.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-కనిగిరి

బాల్యవివాహాల నిరోధక కమిటీ సభ్యులకు బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌బిసిసి కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్, సిడిపిఒ సంగీత లక్ష్మి,గుడ్‌హెల్ప్ డైరక్టర్ మంద్రు రమేష్‌బాబు మాట్లాడుతూ బాల్యవిహాలు చట్ట రీత్యానేరమని తెలిపారు. కనిగిరిని బాల్యవివాహాల రహితంగా మార్చేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు నిర్వహించే వారిపై కఠిన తప్పవని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నవయస్సులోనే వివాహాలు చేయరాదన్నారు.

పోటాపోటీగా సిఎం జన్మదిన వేడుకలు

శింగరాయకొండ : సిఎం జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను వైసిపి నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయి నిర్వహించారు. వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు ఆధ్వర్యంలో కందుకూరు రోడ్ లోని రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద సిఎం జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచులు, ఎంపిటిసిలు మినహా మిగతా నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి వైస్ చైర్మన్ యన్నాబత్తిన అరుణ, ఎంపీపీ కట్ట శోభారాణి, వైస్ ఎంపిపి సామంతుల రవికుమార్ రెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షుడు షేక్ పటేల్ ,షేక్ సలీం బాషా, షేక్ సలీం . వైస్ ఎంపీపీ షకీలా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేకును కట్ చేసి అన్నదానం నిర్వహించారు. సాయంత్రం సమయంలో శింగరాయకొండ యువజన విభాగం అధ్యక్షుడు శీలం రాము ఆధ్వర్యంలో రైల్వే రోడ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అనంతరం



సిఎం జన్మదిన వేడుకల్లో డాక్టర్ వెంకయ్య

డాక్టర్ మాదాసి వెంకయ్య మాట్లాడుతూ మంగళవారం దర్శికి ముఖ్యమంత్రి కొండపి నియోజకవర్గంలో గురించి వివరించారని త్వరలో అన్ని సర్దుకుంటాయని నీకు ఎలాంటి ఇబ్బంది లేదని హామీ ఇచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి వైస్ చైర్మన్ యన్నా బత్తిన అరుణ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాపూరి ప్రభావతి. వైస్ ఎంపీపీ షేక్ షకీల, తంబు సుబ్బులమ్మ యాదవ్, మహాసభ జాతీయ నాయకులు బొట్ల రామారావు, నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి నాయకులు



సిఎం జన్మదిన వేడుకల్లో వరికూటి అశోక్‌బాబు

హాజరయ్యారు.

అద్దంకిలోనూ గ్రూపుల పోరు

అద్దంకి నియోజకవర్గ వైసిపి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సిఎం జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మాట్లాడుతూ ఇన్‌ఛార్జిగా ఉన్న నేత నిజమైన కార్యకర్తలకు అన్యాయం చేస్తున్నారని, టిడిపి, జనసేనకు సహకరిస్తున్నారని ఆరోపించారు. ఇలా అద్దంకిలో సిఎం జన్మదిన వేడుకల్లో వైసిపి గ్రూపుల పోరు మరోసారి ముందుకొచ్చింది.

రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు : ఎఒ

ప్రజాశక్తి -జరుగుమల్లి

మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి బెల్లం నిర్మలా సత్యన్నారాయణ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎఒ యుగంధరరెడ్డి మాట్లాడుతూ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శనగ పంట నష్టపోయిన రైతులకు 80 శాతం సబ్సిడితో కాగ్–2, జెజె 11 రకం శనగలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యు ఎఇ రమేష్ మాట్లాడుతూ జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ పి.రాయకృష్ణ, పశు వైద్యాధికారి డాక్టరు అరుణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాదికారులు డాక్టర్ కె.శ్రీధరరెడ్డి, డాక్టర్ జి.రేష్మి, గృహనిర్మాణ శాఖ ఎఒ అవినాష్, వైస్ ఎంపిపి పులి బిక్షాలు, సర్పంచులు నాగినేని భాస్కరచౌదరి, కొండాబత్తిన కృష్ణయ్య, కసుకుర్తి పున్నారావు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సిఎంను విమర్శించే స్థాయి వారికి లేదు : వైసిపి



మాట్లాడుతున్న వైసిపి నాయకులు

పెద్దారవీడు : సిఎం జగన్మోహన్ ఒడ్డిని విమర్శించే స్థాయి టిడిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ నాయకుడు రాజుకు లేదని ఎంపిపి బెజవాడ పెద్ద గురువయ్య తెలిపారు. మండల పరిధిలోని హనుమాన్ జంక్షన్ (కుంట)లో వైసిపి నాయకుల ఆధ్వర్యంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ యర్రగొండపాలెంలో నిర్వహించిన ఐక్య క్రిస్మస్ వేడుకలల్లో రాజు వైసిపి ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదన్నారు. కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు ఇంటి వద్దకే అందిస్తున్న ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సిఎం జగన్‌పై నోరు పారేసుకుంటే ఊరుకునే ప్రసక్తి లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో జడ్‌పిటిసి యేర్వ చలమారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ పాలిరెడ్డి కష్ణారెడ్డి, సర్పంచులు జి.రమేష్, బలుసుపాటి నాగరాజు, బెజవాడ ఆదాం, నాయకులు లింగాల ఇశ్రాయేలు, రామాంజ నేయరెడ్డి, ఆవులయ్య, కంచర్ల సుబ్బయ్య, వైస్ ఎంపిపి గుండారెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, ఎంపిటిసి పెద్దకాశయ్య, ఎఎంసి వైస్‌చైర్మన్ కాశయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ లక్ష్మణరావును కలిసిన ఆరోగ్య మిత్రలు

పెద్దదోర్నాల: విజయవాడలో రాష్ట్రస్థాయి ఆరోగ్య మిత్రుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ కె.లక్ష్మణరావు పాల్గొన్నారు. ఈ సందర్బంగా రాష్ట్ర ఆరోగ్య మిత్రుల సంఘం నాయకులు లక్ష్మణరావును కలిసి తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రులకు సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్య ప్రిన్సిపల్ సెక్రెటరీకి, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సిఇఒను కలిసి ఆరోగ్య మిత్రులు సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి, రాష్ట్ర కార్యదర్శి అప్పారావు, రాంబాబు, మార్కాపురం కిరణ్, చంద్రశేఖర్ యాదవ్, హరిబాబు, సుధీర్ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీతో ఆరోగ్య మిత్రలు

పంటలను పరిశీలించిన అధికారులు

పిసిపల్లి : మండల పరిధిలోని పెదఅలవలపాడు, మురుగుమ్మి రైతు భరోసా కేంద్రాలను సహాయ వ్యవసాయ సంచాలకులు ఇవి.రమణ బుధవారం సందర్శించారు. అనంతరం దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న మినుము పంటలను పరిశీలించి పంట నష్ట జాబితా నమోదు చేయాలన్నారు. ఈ నెల 21లోపు పంట నష్ట నమోదును పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ జి.వెంకటస్వామి, విఎఎలు పాల్గొన్నారు. **పెద్దారవీడు :** మండల పరిధిలోని కంభంపాడు వ్యవసాయ శాఖ అధికారులు అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ వారితో కలిసి వరి కోతలో పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఒ కె.బుజ్జిబాయి, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, గ్రామ ఉద్యాన సహాయకుడు వస్రంనాయక్, రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముఖ్యమంత్రి పర్యటన

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా: బాపట్ల జిల్లా చుండూరు మండలంలోని యడ్లపల్లి గ్రామంలోని ఆలపాటి వెంకట రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసే కార్యక్రమం కట్టుదిట్టమైన భద్రత నడుమ ప్రశాంతంగా ముగిసింది. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో గుంటూరు రేంజ్ డీఐజీ సీఎం త్రివిక్రమవర్మ, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌లు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి, సభా ప్రాంగణం, కాన్వాయ్ ప్రయాణించే మార్గం, హెలిపాడ్, పార్కింగ్ ఏరియాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు పరిశీలించి, మార్గమధ్యంలో, సభావేదిక, గ్యాలరీలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పరిశీలించారు. కంట్రోల్ రూమ్‌ను, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను తనిఖీ చేసి, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విధులు నిర్వహించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. యడ్లపల్లి గ్రామానికి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి హెలిప్యాడ్ వద్ద గుంటూరు రేంజ్ డీఐజి డాక్టర్ సిఎం త్రివిక్రమ్‌వర్మ, బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌లు పుష్ప గుచ్ఛంతో సాదరంగా ఆహ్వానం పలికారు. ముఖ్యమంత్రి పర్యటన ముగిసిన అనంతరం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చూసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకొని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి సమర్థవంతంగా విధులు నిర్వహించిన పోలీస్ అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ, గుంటూరు రేంజ్ డిఐజి అభినందించారు.





బందోబస్తు ఏర్పాట్లలో గుంటూరు రేంజ్ డిఐజి సిఎం త్రివిక్రమ వర్మ, ఎస్పీ వకుల్ జిందాల్, సిఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మంత్రి మేరుగ

ముఖ్యమంత్రికి ప్రజాప్రతినిధులు, అధికారుల ఘనస్వాగతం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బుధవారం ఉదయం 10.52 గంటలకు యడ్లపల్లి హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌ను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావు, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్, పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రావి రామనాథం బాబు, అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య, ఎమ్మెల్సీ పోతుల సునీత, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, గుంటూరు రేంజ్ డిఐజి సిఎం త్రివిక్రమ వర్మ, జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ తదితరులు మర్యాద పూర్వకంగా పుష్పగుచ్ఛాలు అందజేశారు. సభానంతరం మధ్యాహ్నం 2.10 గంటలకు ముఖ్యమంత్రి హెలీప్యాడ్ నుంచి బయలుదేరి తాడేపల్లి వెళ్లారు.







ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి స్వాగతం పలుకుతున్న బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, గుంటూరు రేంజి డిఐజి త్రివిక్రమ వర్మ, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి

వైద్య సంఘాల సమాఖ్య కార్యదర్శిగా రవిచంద్రారెడ్డి

ప్రజాశక్తి-చెరుకుపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అనుభవ వైద్య సంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శిగా చెరుకుపల్లి మండలానికి చెందిన త్రిపురం రవిచంద్ర రెడ్డి ఎంపికయ్యారు. కోనసీమ జిల్లా అమలాపురం కిమ్స్ వైద్యశాలలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో నూతన కమిటీ ఎంపిక ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. తన నియామకం పట్ల వ్యవస్థాపక అధ్యక్షులు రాజా సిద్ధార్థ, ఫెడరేషన్ అధ్యక్షులు జీఎస్ ప్రసాద్, కమిటీ సభ్యులకు రవిచంద్రారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలి

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎంఆర్‌పిఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు జలదంకి నరసింగరావు మాదిగ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జిఒ మంద కృష్ణమాదిగ సారధ్యంలోని ఎంఆర్‌పిఎస్ కమిటీల నియామకం కోసం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వర్గీకరణపై కేంద్రం ఎప్పటికప్పుడు తప్పుకోవడం సరికాదన్నారు. 2023 జనవరి 4వ తేదీన ఎంఎస్‌ఎఫ్ జాతీయ మహాసభలు, 6వ తేదీన బెంగళూరులో ఎంఆర్‌పిఎస్ జాతీయ మహాసభలు జరుగుతున్నాయని, ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.



రాష్ట్రస్థాయికి ఎన్నికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పోటీల్లో..

పేరాల హైస్కూల్ విద్యార్థుల విజయం

ప్రజాశక్తి-చీరాల

వివిఎం 2022-23 పరీక్షలు రాష్ట్ర స్థాయికి ఎన్నికైన పేరాల హైస్కూల్ విద్యార్థులు అచ్యుత సోమనాథ్. దిడ్ల మనోజ్‌లను పేరాల ఆంధ్రరత్న మునిసిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సిహెచ్ సాల్మన్, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ పావని భాను చంద్రమూర్తి అభినందించారు. విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ సంస్థలైన విజ్ఞాన ప్రసార్, ఎన్సీఈఆర్టీ, విజ్ఞాన భారతి వారిచే గత నెల 27వ తేదీ నిర్వహించిన జాతీయ ప్రతిభాన్వేషణ పరీక్ష విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వివిఎం)లో ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎన్నికయ్యారని ప్రధానోపాధ్యాయులు బి సాల్మన్ తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కె రాజేంద్రప్రసాద్, వై గాంధీ, శ్రీనివాసులు, వెలుగొండారెడ్డి, కృష్ణ మోహన్, ప్రసన్న కుమారి, సుశీల, విద్యార్థులు పాల్గొన్నారు.



పర్చూరు మండలం చెరుకూరులో ట్యాబ్‌లు అందిస్తున్న దృశ్యం

విద్యార్థులకు ట్యాబ్‌లు ఇవ్వడం హర్షణీయం

ప్రజాశక్తి-పర్చూరు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు బహుముఖ ప్రజ్ఞావంతులుగా రాణించాలనే ఉద్దేశంతో వారికి బైజుస్ యాప్‌లు, ట్యాబ్‌లు అందజేయడం అభినందనీయమని జడ్పిటిసి కొల్లా గంగా భవాని ముఖ్యమంత్రిని ప్రశంసించారు. చెరుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదివే 373 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేకా ఆనందకుమారి, ఎంఈఓ డి నాగేశ్వరరావు, పాఠశాల వైస్ ఎంపీపీ పాలేటి వీరయ్య, చెరుకూరు గ్రామ సర్పంచ్ పేరం సుబ్బారావు, ప్రధానోపాధ్యాయులు ఎంవి సుబ్బారావు, పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ బి లక్ష్మీనారాయణ, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రెండు ట్యాంకర్లు ఢీ.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-ముండ్లమూరు

మండలంలోని పోలవరం గ్రామం వద్ద ఒక ఆయిల్ ట్యాంకర్, లిక్విడ్ ట్యాంకర్ అద్దంకి-దర్శి రోడ్డులో ఢీకొనడంతో మధ్యప్రదేశ్‌కు చెందిన ట్యాంకర్ డ్రైవర్ లకాన్‌సింగ్ తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనను 108 వాహనంలో అద్దంకి తరలించారు. ఆధార్ కార్డు ఆధారంగా సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసినట్లు స్థానికులు తెలిపారు.



మృతి చెందిన యువకుడు మణికంఠ

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానిక ఉత్తరం వైపు ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన యువకుడి మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. స్థానికుల సమాచారం అందుకున్న టంగుటూరు ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా, సింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్, పోలీసు సిబ్బంది బుధవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వివరాల్లోకి వెళితే.. ఒంగోలు రూరల్ మండలం యరజర్లకు చెందిన కసుకుర్తి మణిచంద్(24) మంగళవారం రాత్రి బంధువుల కార్యక్రమానికై జరుగుమల్లి మండలం చింతలపాలెం వెళ్లారు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో తిరిగి స్వగ్రామం యరజర్లకు బయలుదేరాడు. అయితే దారిలో టంగుటూరు ఉత్తరం వైపు ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో మణిచంద్ మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. మృతుడు మణిచంద్ కుటుంబ సభ్యులు మాత్రం తమ కుమారుడిని మరో ముగ్గురు యువకులు కలిసి తీసుకుని వెళ్లారని, వాళ్లు కనిపించకపోవడంతో వారిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మణిచంద్‌ను తీసుకెళ్లిన స్నేహితులే హత్య చేసి పడవేసి ఉంటారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. టంగుటూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలిపై దాడి.. మెడలో బంగారం చోరీ

ప్రజాశక్తి-మద్దిపాడు

ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై దాడిచేసి మెడలో ఉన్న ఆరు సవర్ల బంగారు చైన్‌ను దొంగలించిన ఘటన బుధవారం వెల్లంపల్లి కొత్తూరులో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీరామ్ తెలిపిన వివరాల ప్రకారం, కఫా వెంకట్రామిరెడ్డి తన భార్య, తల్లితో కలిసి నివాసం ఉంటున్నాడు. తుఫాన్‌తో దెబ్బతిన్న పంటలను చూసేందుకు తన భార్యతో పొలాలకు వెళ్లారు. ఒంటరిగా ఇంట్లో ఉన్న వృద్ధురాలిని గమనించిన గుర్తు తెలియని దుండగులు ఆమె మెడలోని భారత్ బంగారు చైన్ లాగటానికి ప్రయత్నించగా ఆమె ప్రతిఘటించింది. గొలుసును గట్టిగా పట్టుకుంది. అయితే గొలుసును పట్టుకున్న చేతిని గాయపరచి దుండగులు చైన్‌ను లాక్కొనిపోయారు. వృద్ధురాలు కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చి చేతికి కట్టుకట్టి అనంతరం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీరామ్ తెలిపారు.

చెన్నకేశవుని ఆలయానికి కొత్త శోభ

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రసిద్ధిగాంచిన శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి దేవస్థానంలో నలుదిక్కులా గోపురాల నిర్మాణ పనులను ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పెనుగొండ కేశవరావు బుధవారం ప్రారంభించారు. నూతన గోపురాలను నిర్మించేందుకు అడ్డుగా ఉన్న గోపురాల స్థానంలో ఉన్న పాత కట్టడాల తొలగింపు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కేశవరావు మాట్లాడుతూ నాలుగు గోపురాలతో ఆలయానికి కొత్త శోభను తీసుకువస్తున్నట్లు చెప్పారు. సుమారు రూ. 5.5 కోట్ల వ్యయంతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. దేవదాయ శాఖ నుంచి రూ. 2 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు.



పీకేఆర్ ఎస్టేట్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

సర్వాంగ సుందరంగా పీకేఆర్ ఎస్టేట్స్

ప్రజాశక్తి-కర్లపాలెం: జిల్లా కేంద్రానికి దగ్గరలో కర్లపాలెంలో 100 శాతం డిటిసిపి అప్రూవ్డ్‌తో ఏమాత్రం క్వాలిటీ విషయంలో రాజీపడకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో అన్ని హంగులతో రూపుదిద్దుకున్న వెంచర్ పీకేఆర్ ఎస్టేట్స్ అని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. అందరికీ అందుబాటు ధరలు పెట్టారని, ఈరోజు నుంచి బుకింగ్స్ ప్రారంభం అయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సీతారామిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు సుబ్బారావు, ఎంపిటిసీలు తాండ్ర సాంబశివరావు, ఆసిఫ్ అలీ, లక్ష్మణ్, కో ఆప్షన్ సభ్యులు అమీర్ బేగ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాధితులకు చెక్కు అందజేస్తున్న హెచ్‌ఆర్‌సిఐ ప్రతినిధి హేమంత్

పరిమళించిన మానవత్వం

- చిన్నారికి రూ.60 వేలు, కిడ్నీ బాధితునికి రూ.20 వేల సాయం

ప్రజాశక్తి-చీరాల: ఆపదలో ఉన్న వారి అవసరాన్ని గుర్తించి సమాజ సేవలో భాగంగా మానవత్వంతో స్పందించి ముందడుగు వేశాడు హెచ్‌ఆర్‌సిఐ ప్రతినిధి హేమంత్. మండలంలోని వాడరేవు గ్రామానికి చెందిన సంతోష్ చేపల వ్యాపారం చేస్తూ పేదరికంతో ఇబ్బంది పడుతున్నారు. అయితే వారికి మూడు నెలల కుమార్తె ఉంది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా మారింది. బ్లడ్ సెల్స్ తగ్గిపోవడం, వ్యాధులతో బాధపడుతున్న విషయం తెలుసుకుని పాప చికిత్స ఖర్చుల నిమిత్తం చిన్నారి అమ్మమ్మ రమణమ్మకు రూ.60 వేల ఆర్థిక సాయాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. తోటవారిపాలెం గ్రామానికి చెందిన శీలం సాయి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకుని ఆ కుటుంబానికి ఇరవై వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా హేమంత్ మాట్లాడుతూ గ్రూపుల్లో విషయం తెలుపగా స్పందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేణు, శివ నాగేశ్వరరావు, ఏసురాజు, మహేష్, సాయి, సందీప్ పాల్గొన్నారు.



పర్చూరులో హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న ఎంపిడిఓ

హాస్టల్‌ను తనిఖీ చేసిన ఎంపిడిఓ

పర్చూరు: పర్చూరులోని గిరిజన సంక్షేమ(ఎస్‌టి) హాస్టల్‌ను ఎంపిడిఓ విజయలక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో స్వయంగా మాట్లాడారు. పిల్లలకు వెంటనే వైద్య చికిత్స నిమిత్తం దగ్గుబాడు వైద్యాధికారితో మాట్లాడారు. గురువారం వైద్యశిబిరం నిర్వహించి పరీక్షలు చేయాలని ఆదేశించారు.



ముప్పవరం పంచాయతీ కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం - ప్రజాశక్తి-పంగులూరు

ఘనంగా జగన్ జన్మదిన వేడుకలు

వృద్ధులకు దుస్తుల పంపిణీ ● కేకులు కట్ చేసిన వైసిపి శ్రేణులు

బాపట్ల జిల్లాలోని పలు ప్రాంతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కేకులు కోసి సంబరాలు జరుపుకున్నారు.

ప్రజాశక్తి-చీరాల

పేదల పక్షపాతి ముఖ్యమంత్రి జగన్ తన పథకాల ద్వారా దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాడని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వరికూటి అమృతపాణి, మునిసిపాలిటీ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అన్నారు. సిఎం జన్మదిన వేడుకల సందర్భంగా చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసిపి చీరాల ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ ఆధ్వర్యంలో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ జైసన్‌బాబు అధ్యక్షతన చీరాల గడియార స్తంభం సెంటర్లో ఉన్న రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, పాలతో అభిషేకం చేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కోసి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండి డాక్టర్ తాడివలస దేవరాజు, కట్టా చంద్ర, కాగితాల ప్రకాష్, దామర్ల శ్రీకృష్ణ, ఖాబీర్, బుర్ర మురళీకృష్ణ, మించాల సాంబశివరావు, బత్తుల అనిల్, కంప అరుణ్, ఎబినేజర్, కీర్తి వెంకట్రావు, ఉల్లిపాయ సుబ్బయ్య, సుభాని, అరుణ్, వాసు మల్ల బ్రదర్స్, గోసాల అశోక్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదినాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వైసిపి నాయకులు గ్రామ ఉపసర్పంచ్ బుర్లె రాంప్రసాద్ ఆధ్వర్యంలో టిఎం రావు ఉన్నత పాఠశాలలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అలాగే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు రొట్టెలు, యాపిల్, దానిమ్మ, బత్తాయి వంటి పండ్లను అందజేశారు. ఎంపిపి డివి లలితకుమారి, జెడ్‌పిటిసి టి ఉదయ్ భాస్కరి, సర్పంచ్ దారా రవికిరణ్మయి కూడా జగనన్నకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రామకోటేశ్వరరావు, వైద్యాధికారి డిఎల్ పద్మజ తదితరులు ఉన్నారు.

కర్లపాలెం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కర్లపాలెం ఐలాండ్ సెంటర్‌లో దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద కర్లపాలెం మండల వైసిపి నాయకులు ఏర్పాటు చేసిన కేక్‌ను ఎమ్మెల్యే కోన రఘుపతి కట్ చేసి పార్టీ నాయకులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు దొంతిబోయిన సీతారామిరెడ్డి, జడ్‌పిటీసీ పిట్ల వేణుగోపాల్ రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పందరబోయిన సుబ్బారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 50వ జన్మదిన వేడుకలు ఇంకొల్లులోని వైఎస్‌ఆర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. పర్చూరు నియోజకవర్గ వైసిపి వాణిజ్య విభాగం కన్వీనర్ చిన్ని పూర్ణరావు ఇంకొల్లు మండల ప్రచార కమిటీ అధ్యక్షులు అమ్మిశెట్టి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి తూమాటి చలమయ్య, ఇంకొల్లు మండల విద్యార్థి విభాగం అధ్యక్షులు సునీల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంకొల్లు మండల కన్వీనర్ బండారు ప్రభాకరరావు, బండ్ల సుబ్బారావు, పార్టీ టౌన్ ప్రెసిడెంట్ షేక్ లతీఫ్, ఎంపిటిసి సభ్యులు షేక్ ఆయేషాబుడే, షేక్ ఉస్మాన్, ఆర్యవైశ్య సంఘం నాయకులు దోగిపర్తి అయ్యప్ప స్వామి, మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

నగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం నగరంలోని ప్రధాన కూడలిలో వైఎస్సార్ విగ్రహం వద్ద మోపిదేవి తనయుడు రాజీవ్ భారీ కేక్ కట్ చేశారు. ముందుగా దివంగత నేత రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



చీరాలలో దుస్తులు పంపిణీ చేస్తున్న డాక్టర్ అమృతపాణి

అనంతరం స్థానిక ఎంపిపి చింతల శ్రీకృష్ణయ్య ఏర్పాటు చేసిన భారీ కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా రాజీవ్ మాట్లాడారు. అనంతరం మూడువేల మందికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చింతల శ్రీకృష్ణయ్య, జడ్పిటిసి మాన్యం నాగమణి, నగరం గ్రామ సర్పంచ్ ఇంకొల్లు రామకృష్ణ, ఏలిపాలెం సర్పంచ్ పి జాఫర్, గ్రామ సర్పంచులు, వైఎస్సార్ అభిమానులు పాల్గొన్నారు.

కారంచేడు: రాష్ట్ర ముఖ్యమంత్రి 50వ జన్మదిన సందర్భంగా బుధవారం నాడు మండల ఎంపిపి నీరుకట్టు వాసుబాబు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 300 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి యార్లగడ్డ రజిని శ్రీనివాసరావు, వైసిపి మండల కన్వీనర్ దండా చౌదరి బాబు, సభ్యులు ముల్లా నూర్ అహ్మద్, పిఎసిఎస్ చైర్మన్ ఎర్రం లక్ష్మారెడ్డి వైసిపి నాయకులు చల్లా సుబ్బారెడ్డి, కారుమంచి సుబ్బారెడ్డి, జరుగుడువారి పాలెం సర్పంచి మాదాసు కుమారి, గోగినేని సతీష్, పగడాల బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ముప్పవరంలోని పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ రౌతు సాంబశివరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ సాంబశివరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముప్పవరం ఎంపిటీసీ గంగాధర్, రేషన్ డీలర్ తోట రామాంజనేయులు, వైసీపీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్చూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 50వ జన్మదిన వేడుకలు పర్చూరు బొమ్మల సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. మహానేత స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ప్రకాశం జిల్లా డిసిఎమ్ఎస్ చైర్‌పర్సన్ రావి పద్మావతి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం స్థానిక వైసిపి కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల నడుమ భారీ కేక్ కట్ చేసి ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ చుండి సుజ్ఞానమ్మ, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని దేవరపల్లి గ్రామంలో రైతు భరోసా కేంద్ర ఆవరణలో ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు



వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలరాం



కర్లపాలెం ఐలాండ్ సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కోన

ఘనంగా జరిగాయి. పాఠశాల విద్యార్థుల చేతుల మీదుగా కేక్ కట్ చేశారు. శిబిరంలో యువ నాయకులు రావి లీలాకృష్ణ, ఎంపిపి మేకా ఆనందకుమారి, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు వై హరిప్రసాద్, పి ఏడుకొండలు, మాజీ ఎంపిపి కోట హరిప్రసాద్, సర్పంచ్ మల్లా అంజమ్మ, డాక్టర్ పి సుభాషిణి, ఎ సుబ్బారావు, తిరుమలరావు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దేవరపల్లి గ్రామ ఉప సర్పంచ్ తోకల కృష్ణమోహన్, సర్పంచ్ పరతోటి లాజర్, సోమేపల్లి వెంకటేశ్వర్లు, కావు వాసు, పంచాయతీ కార్యదర్శి కందిమల్ల శ్రీనివాస్‌రావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

చీరాల: చీరాల తన సొంత ప్రాంతమని, చీరాలతో అనుబంధం ఈనాటిది కాదని, తన రాజకీయ ప్రస్థానం చీరాల నుంచే ప్రారంభం అయిందని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో నియోజకవర్గ ప్రజలు అన్నివేళలా అండగా నిలబడ్డారని, అదేవిధంగా సీఎం స్ఫూర్తితో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు స్వీకరించి పార్టీ కార్యక్రమాలను బలోపేతం చేస్తున్న తన కుమారుడు కరణం వెంకటేష్ బాబుకు చీరాల ప్రజలు అండగా నిలవాలని ఆయన కోరారు. వైసిపి అధిష్ఠానం నిర్వహిస్తున్న ప్రభుత్వ కార్యక్రమాలలో ఎంతో చురుకుగా పనిచేస్తూ ప్రజలతో మమేకమైన వెంకటేష్‌కు అన్నివేళలా అండగా నిలవాలని కోరారు. బుధవారం స్థానిక ఎన్‌ఆర్‌ఎన్‌పి హైస్కూల్లో ముఖ్యమంత్రి జగన్ పుట్టినరోజు వేడుకల సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన మున్సిపల్ పరిధిలోని వృద్ధులకు చీరల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ అమతపాణి పలువురు పార్టీ ప్రముఖులు హాజరయ్యారు. పుట్టినరోజు వేడుకల సందర్భంగా ఆర్డీవో సరోజిని హాజరయ్యారు. ముందుగా పలువురు పాస్టర్లతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేసి సీఎంకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వృద్ధులకు చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జైసన్ బాబు, వార్డు కౌన్సిలర్ బాలకృష్ణ పలువురు పార్టీ నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పేద పిల్లల మధ్య పుట్టినరోజు వేడుకలు అదృష్టం: మంత్రి మేరుగ

బాపట్ల జిల్లా: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తన పుట్టినరోజు వేడుకలను పేద పిల్లల మధ్య చేసుకోవడం తమ అదృష్టంగా భావిస్తున్నామని సాంఘిక సంక్షేమ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. బాపట్ల జిల్లాలోని యద్దపల్లి గ్రామంలోని ఆలపాటి వెంకటరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసే కార్యక్రమం సందర్భంగా జరిగిన సభలో మంత్రి నాగార్జున మాట్లాడారు. సిఎం జగన్ విద్యకు ప్రాముఖ్యతనిచ్చి నాడు నేడు పేరుతో స్కూల్స్ బ్రహ్మాండంగా బాగుచేయిస్తున్నారని అన్నారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఈ రోజు కొత్త శకానికి నాంది పలికిన రోజని అన్నారు. ముఖ్యమంత్రి జన్మదినం రోజున విద్యారంగంలో తీసుకొస్తున్న పథకాల ద్వారా మన విద్యార్థులు ప్రపంచంలోనే పోటీతత్వంతో నిలదొక్కుకోవాలని సూచించారు.







భట్టిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం, ఇంకొల్లులో కేక్ కట్ చేస్తున్న నాయకులు, పర్చూరులో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం.రమేష్

ప్రజాశక్తి-పొదిలి

పాలకులు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్యంగా తిప్పి కొట్టాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం.రమేష్ తెలిపారు. స్థానిక ఎన్‌జిఒ హోంలో సిఐటియు పొదిలి మండల 7వ మహాసభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కార్మిక చట్టాలను సవరించి లేబర్ కోడ్స్ తీసుకురావటం ద్వారా కార్మికులు బేరసారాలడే హక్కును కాలరాస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేటర్ సంస్థలకు ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రకతి వనరులను దారాదత్తం చేస్తున్నట్లు తెలిపారు. స్కీం వర్కర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం.రమేష్

కల్పించకుండా ఒట్టి చేతులతో ఇంటికి సాగనంపడం దుర్మార్గమన్నారు. స్కీం వర్కర్లకు గ్రాట్యుటీ ఇవ్వాలన్న సుప్రీం కోర్టు తీర్పును ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలన్నారు. పొదిలి నగర పంచాయతీ కార్మికులకు వెంటనే హెల్త్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. స్కీం వర్కర్లపై పనిభారాన్ని తగ్గించాలన్నారు. స్వచ్ఛ భారత్ కార్మికులకు బకాయిలు జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. సిఐటియు మండల అధ్యక్షుడు వి.ప్రభుదాసు అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో సిఐటియు జిల్లా మాజీ నాయకులు కందుల రవి, ఎం.శోభారాణి, ఎస్.పద్మ, నాగమల్లేశ్వరి, జి.నాగులు, బి.కోటేశ్వరావు, డి.నరసయ్య, వి.వినోద్, డి.జాన్ డేవిడ్, ఎ.వెంకట్రావు, ఆర్.తిరుపతయ్య, వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

సిఐటియు నూతన కమిటీలు ఏకగ్రీవం

ప్రజాశక్తి-మార్కాపురం

సిఐటియు మార్కాపురం పట్టణ, మండల కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. స్థానిక ఎన్‌జిఒ హోంలో సిఐటియు 11వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కమిటీ అధ్యక్షుడిగా కె.సుబ్బరాయుడు, కార్యదర్శిగా పి.రూబెన్, మండల కమిటీ అధ్యక్షుడిగా ఎ.రంగమ్మ, ప్రధాన కార్యదర్శిగా కె.వెంకటేశ్వరా ండ్డిని ఎన్నుకున్నారు. పట్టణ కమిటీ సభ్యులుగా ఎం.లక్ష్మి, తటవర్తి గురునాథం, ఇ.రాంబాబు, టి.రాములు, వెంకటేశ్వర్‌రెడ్డి, వై.నాగేశ్వరరావు, జి .శ్రీనివాసులు, ఎస్‌కె. బాషా, అల్లూరయ్య, కాశయ్య ఎన్నికయ్యారు.మండల కమిటీ సభ్యులుగా 7 మందిని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

తీర్మానాలు ఇవే...

మున్సిపల్ రంగంలోని ఇంజినీరింగ్ విభాగం కార్మికులకు హెల్త్ అలవెన్స్, సమాన పనికి సమాన వేతనం, సంక్షేమ పథకాలు అమలు చేయాలని తీర్మానించారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులందరికీ ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలు పెంచాలని, బిల్డింగ్ ,ముఠా, ఆటో తదితర రంగాల్లో పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికులం దరికీ ఇంటి స్థలం, పక్కా గహం నిర్మించి ఇవ్వాలని, వివిధ ప్రభుత్వ స్కీంలలో పనిచేస్తున్న స్కీం వర్కర్లందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని తీర్మానించారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న



కె.సుబ్బారాయుడు, పి.రూబెన్



కె.వెంకటేశ్వరరెడ్డి



ఎ.రంగమ్మ

భోజన పథకం కార్మికులకు వేతనాలను పెంచాలని, సంక్షోభంలో కూరుకుపోయిన డిజైన్స్ స్లేట్ పరిశ్రమకు ప్రభుత్వం రాయితీలు ఇచ్చి ఆదుకోవాలని, కార్మికులకు ఉపాధి అవకాశాలు పెంచాలని, వెలుగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని, కార్మి కులపై రాజకీయ వేధింపులు అరికట్టాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పని ప్రదేశాల్లో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని తీర్మానాలను మహాసభ ఆమోదించింది.

కరాటేలో విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి-జరుగుమల్లి

మండల పరిధిలోని కామేపల్లి సహస్రా ఉన్నత పాఠశాల విద్యార్థుఉ లు హైదరాబాద్ లోని కూకట్‌పల్లిలో ఉన్న శ్రీ పుల్లూరి నారాయణ దాసు కళ్యాణ మండపంలో నియుధలీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వారు నిర్వహించిన కరాటే, కింగ్‌ఫూ పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయి కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్ షిప్ పోటీలకు హాజరయ్యారు. కటా విభాగంలో బి.జశ్విత, పి.సాయి పూజిత బంగారు పతకాలు సాధించారు. ఎస్.మేఘన వెండి పతకం. పి.హితేశ్రీ కాంస్య పతకం సాధించింది. జూనియర్ బాలుర కటా విభాగంలో జె.అఖిల్ రహమాన్ బంగారు పతకం. వి.హేమచంద్, కె.విష్ణుపార్థు వెండి పతకం సాధించారు. ఈ నెల 11న హైదరాబాదు లోని యూసఫ్ గూడలోఉన్న కోట్ల విజయభాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియంలో సెల్ఫ్ డిఫెన్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వారు నిర్వహించిన తొలి జాతీయ మార్షల్ ఆర్ట్స్ చాంఫియన్ షిప్- 2022 పోటీలకు సహస్రా పాఠశాల బాలురు జూనియర్స్ కటా విభాగంలో



పతకాలు సాధించిన విద్యార్థులు వీరే..

ఎన్.యశ్వంత్ బంగారు పతకం సాధించారు. ఎన్.లక్ష్మీరోహిత్ కుమార్, వి.నిఖిల్ వెండి, జె.అబ్దుల్, రహమాన్ కాంస్య పతకం సాధించాడు. బాలికల విభాగంలో పి.సాయి పూజిత కాంస్య పతకం సాధిచింది. అదేవిధంగా ఈ నెల 18న హైదరాబాదు లోని టోలీ చౌక్‌లిమా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో షావోలిన్ -టైగర్స్ కుంగుఫూ ఇంటర్ నేషనల్ వారు నిర్వహించిన దక్షిణ భారత దేశ కరాటే కుంగ్‌ఫూ చాంపియన్ షిప్-2022 పోటీలకు సహస్రా పాఠశాల విద్యార్థులు జూనియర్ బాలుర కటా విభాగంలో వై.మనోజ్ బంగారు, కె.ఠాగూర్ వెండి, షేక్ ఆఫీజ్ కాంస్య పతకం సాధించారు. జూనియర్ బాలికల విభాగంలో టి.వర్షిత వెండి, వై.స్పందన కాంస్య పతకం సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులు, కోచ్ షేక్ గాలిబ్ జాన్‌ను పాఠశాల అధ్యాపక బృందం బుధవారం అభినందించారు.

విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

స్థానిక వెంకటేశ్వర కాలనీలో రూ. 3కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ కార్య క్రమాలు అమలుతోపాటు అభివృద్ధి కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. 50వ డివిజన్‌లో నెలకొన్న ప్రజా సమస్యలు ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు ద్వారా దాదాపు 5వేల గృహాలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించ నున్నట్లు తెలిపారు. వెంకటేశ్వరకాలనీ, జయప్రకాష్‌కాలనీల్లోని విద్యుత్ లైన్ల సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. డివిజన్‌లో



శంకుస్థాపనలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

కమ్యూనిటీహాలు ఏర్పాటు చేయాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత,స్థానిక కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు, కమిషనర్ వెంకటేశ్వరరావు, విద్యుత్ శాఖ ఎస్‌ఇ సత్యనారాయణ, డిఇ వినయ్‌కుమార్‌రెడ్డి, ఎఇ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పెద్ద పీట : జడ్‌పిటిసి

పజాశక్తి-కొనకనమిట్ల

విద్యాభివద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జడ్‌పిటిసి అక్కి దాసరి ఏడుకొండలు, మండల ఉపాధ్యక్షుడు మెట్టు వెంకటరెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో మండల స్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు-నేడు పథకం ద్వారా విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం బాటలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సైన్సు ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎస్‌కె. ఢాంగేషరీఫ్, ప్రధానో పాధ్యాయుడు రామాంజనేయులు,



జడ్‌పిటిసి, ఎంపిపిని సన్మానిస్తునన దృశ్యం

విద్యాకమిటీ చైర్మన్ కడెం ఆంజనేయులు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి గురుస్వామి, ఎంవి.శ్రీనివాసరావు, పి. ఆంజనేయ చౌదరి, బాదం రవికుమార్, జి.ఐజాక్ బాబు, కె.ఆదాము, కె.పద్మజ, పెదారికట్ల కె. పద్మజ, పివి.నాగశైలజ, టి.రామా రావు, జట్ల రవికుమార్, యుద్ధం శ్రీనివాసులు, మనోరమ, సుభాషిని ఉపాధాయులు తదితరులు పాల్గొన్నారు.

సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - గిద్దలూరు

ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యమే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యమని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని 34 మందికి రూ.30 లక్షల 74 వేల చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బంగారు శీనయ్య, మున్సిపల్ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, మాజీ ఎంపీపీ కడప వంశీధర్ రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ షేక్ మస్తాన్ వలి, వైసిపి నాయకులు కంచర్ల కోటయ్య గౌడ్,బాదం గోపాల్, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు .**జరుగుమల్లి :** ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను బాధితులకు వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బెల్లం నిరలా సత్యన్నారాయణ, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-చీమకుర్తి

సిఎం జగన్ జన్మదినం సంధర్భంగా మద్దిపాడు ఎఎంసి మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి ఆధ్వర్యంలో రామ్‌నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రాతపుస్తకాలు,ె ఎన్నులు అందజేశారు. ఈ సందర్భంగా వెంకారెడ్డి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయుడు పివి. కోటేశ్వరరావు, మారం యూత్ నాయకులు నాగేశ్వరరెడ్డి, మధురెడ్డి, బడే దశరథరామిరెడ్డి, సురేష్‌రెడ్డి,కోటా రాములు, పి.నాగరాజు, నాగేశ్వరరావు,కన్నయ్య పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-కొండపి

క్రిస్మస్ పండుగ సందర్భంగా అనాథలు, వృద్ధులు, వికలాంగులు, అంధులకు దుస్తులు, దుప్పట్లు ఆహారం అందజేసినట్లు దాసిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన హెచ్‌ఎస్‌పిఎం చర్చి పాస్టర్లు ప్రభుదాస్, సాల్మన్‌రాజు తెలిపారు. కొండపి నుంచి ఒంగోలు వరకూ రోడ్డు వెంట ఉండే అనాథలు, వృద్ధులు, యాచకులకు బుధవారం ఆహారం అందజేసి దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఒంగోలు బలరాం కాలనీలోని వృద్ధాశ్రంలోని వృద్ధులకు దుస్తులు అందజేసినట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు

కొండపి : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కొండపి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాద్యా యురాలు పద్మావతి తెలిపారు. రాష్ట్ర స్థాయి అండర్-17 బాలుర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఖోఖో పోటీలలో ప్రథమస్థానం సాదించిన విద్యార్థి పి.ఇస్సాక్‌కు బుధవారం సన్మాన సభ నిర్వహించారు. పి.ఇస్సాకు ఈనెల 17,18,19 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా కాకినాడలోని కుతుకులూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్- 17 ఖోఖో పోటీలలో ప్రథమ స్థానం సాధించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పీడీ అరుణ, పిఎస్ ఉపాధ్యాయుడు హనుమాన్‌చారి పాల్గొన్నారు.

వైద్యశాలకు బెడ్డు అందజేత

శింగరాయకొండ : టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యులు జివి.రవీంద్ర (బాబీ) ఆధ్వర్యంలో శింగరాయకొండ ప్రభుత్వం ఆసుపత్రి కి మంచం, బెడ్ బుధవారం అందజేశారు. రవీంద్రబాబు తల్లి గూడూరు పిచ్చమ్మ జ్ఞాపకార్థకం వారి కుమారుడు భవన్ రాజ్ ఆధ్వర్యంలో మంచం, బెడ్ అందజేశారు.

పెద్దకొత్తపల్లి విద్యార్థిని ప్రతిభ

మద్దిపాడు : జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీలకు మండల పరిధిలోని పెద్దకొత్తపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థిని వి.సుమ ఎంపికైంది. సుమ ఇటీవల విజయవాడలో నిర్వహించిన నెట్ బాల్ పోటీలలో ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సుమను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంత కుమారి, పీడీ రాజ్యలక్ష్మి ,ఉపాధ్యాయులు అభినందించారు.

విశ్వేశ్వరరావుకు డాక్టరేట్



విశ్వేశ్వరరావు

పొన్నలూరు : పొన్నలూరుకు చెందిన విశ్రాంత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి కొండపి విశ్వేశ్వరరావు సామాజిక రంగంలో చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఢిల్లీలోని మ్యాజిక్‌బుక్స్ ఆఫ్ రికార్డ్సు డాక్టరేట్ ప్రకటించారు. అయితే విశ్వేశ్వర రావుకు ఆరోగ్యం సహకరించక పోవడంతో డాక్టరేట్ అంద ుకొనేందుకు ఢిల్లీకి వెళ్లలేక పోయారు. కొరియర్ ద్వారా తనకు డాక్టరేట్‌ను పంపినట్లు విశ్వేవ్వరరావు తెలిపారు. డాక్టరేట్ వచ్చిన సందర్భంగా బంధుమిత్రులు, స్నేహితులు విశ్వేర్వరావుకు అభినందనలు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

యర్రగొండపాలెం : నల్లమల అటవీ ప్రాంతంలోని చెన్నుపల్లి చెంచుగూడెంలో పాలుట్ల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బుధవరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా చెంచు గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవపరమైన వారికి మందులు పంపిణీ చేశారు. జ్వర పీడితులకు రక్త పరీక్షలు నిర్వహిం చారు.. గర్భిణులు, చిన్నారులకు టీకాలు వేశారు. రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఐరన్ మాత్రలు, టానిక్‌లు, ప్రొటిన్ పౌడర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది మాధవీలత, జ్యోతిరాణి, జానారెడ్డి, బాషా, నలగాటి వెంకట్రామయ్య నాయుడు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

సంతనూతలపాడు రూరల్ : మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతనూతలపాడు లోని బ్లెస్సింగ్ ఏజీ చర్చిలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే టిజెఆర్.సుధాకర్‌బాబు పాల్గొన్నారు. అనంతరం పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ల పాస్టర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు విలియమ్స్, వైసిపి మండల కన్వీన దుంపా చెంచిరెడ్డి, జడ్‌పిటిసి దుంపా రమణమ్మ, ఎంపిపి విజయ, సర్పంచి నాగమణి మద్దులూరు సర్పంచి శైలజ , పాస్టర్ వి నీతిరాజు, రోజ్ మేరి పాల్గొన్నారు **హనుమంతునిపాడు :** వెలుగు కార్యాలయంలో ఎపిఎం నారాయణరావు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గాయం సావిత్రి, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ యక్కంటి శ్రీనివాస్ రెడ్డి,వైస్ ఎంపిపిలు కొదమల బెంజిమెన్ , రుద్రపాటి శోభ, ఎస్‌సి సెల్ నాయకుడు గురు ప్రసాద్, సర్పంచులు భవనం కష్ణారెడ్డి, కత్తి రాజారావు, ఎంపిటిసి ఉడుముల సుబ్బారెడ్డి, పాల్గొన్నారు. **బేస్తవారిపేట :** పట్టణంలోని యశ్వంత్ స్కూల్ ఉన్నత పాఠశాల బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు శాంతి, పాఠశాల కరస్పాండెంట్ గౌరీ కష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **పామూరు :** టిడిపి కార్యాలయంలో ఎస్‌సి సెల్ మండల అధ్యక్షుడు డోల శేషాద్రి, పట్టణ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు యదాల మాలకొండయ్య ఆధ్వర్యంలో సెమీ క్రిస్మన్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి బొల్లా మాల్యాద్రి చౌదరి, పట్టణ అధ్యక్షుడు షేక్ ఖాజా రంతుల్లా ఐటిడిపి కోఆర్డినేటర్లు పాల్గొన్నారు. **శింగరాయకొండ :** స్థానిక తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు సిహెచ్. ఉష ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేకును కట్ అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు తన్నీరు వెంకటేశ్వర్లు, ఎఎస్ఒ సుబ్రహ్మణ్యం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుజాతపాల్గొన్నారు.

గణిత దినోత్సవం

కనిగిరి : స్థానిక పులివెంకటరెడ్డి వీధిలోనున్న ఐకిడ్స్ పాఠశాలలో గణిత దినోత్సవ వేడుకలను ప్రిన్సిపల్ షరీఫ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు గణితంలో పోటీ పరీక్షలు నిర్వహించి ప్రతిభను చాటిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయుడు అశోక్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సిఎం జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-మార్కాపురం

ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో సిఎం జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ తరపున శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు మెంబర్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు హబిబుల్లా, మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ, ఎఎంసి చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ ఇస్మాయిల్, సిహెచ్.అంజమ్మ శ్రీనివాస్, ఎంపిపి పోరెడ్డి అరుణా చెంచిరెడ్డి, జడ్‌పిటిసి నారు బాపన్‌రెడ్డి, వైసిపి పట్టణ ప్రధాన కార్యదర్శి బొగ్గరపు శేషగిరిరావు, ప్రభుత్వ జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.సుబ్బారెడ్డి, డాక్టర్ జి.పిచ్చిరెడ్డి పాల్గొన్నారు. **దర్శి :** ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే డాక్టరు మద్దిశెట్టి వేణుగోపాల్ తన క్యాంపు కార్యాలయంలో 50 కేజీల కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. విద్యార్థినులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ వైవి. సుబ్బయ్య, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టరు కుమ్మిత అంజిరెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి, ఎంపిటిసిల సంఘం జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్, నాయకులు సుంకర బ్రహ్మానందరెడ్డి, గోళ్లపాటి అచ్చయ్య, విసిరెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి, యర్రయ్య, వైస్ ఎంపిపి సోము దుర్గారెడ్డి పాల్గొన్నారు. **హనుమంతునిపాడు :** ఎంపిపి గాయం సావిత్రి ఆధ్వర్యంలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి గాయం బలరామిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ యక్కంటి శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపిపిలు కొదమల బెంజిమెన్, శోభ, యూత్ అధ్యక్షుడు భవనం కష్ణారెడ్డి, ఆదినారాయణ రెడ్డి, ఎస్‌సిసెల్ నాయకుడు గురుప్రసాద్, బీసీ నాయకుడు మద్ది తిరపతయ్య, సర్పంచులు ఆలా శివ, కత్తి రాజారావు, కొటికల లింగేశ్వరరావు పాల్గొన్నారు. **ముండ్లమూరు :** ఎంపిపి సుంకర సునీత బ్రహ్మానందరెడ్డి, జడ్‌పిటిసి రత్నరాజు ఆధ్వర్యంలో సిఎం జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి వేముల పద్మావతి జానకీరామ్, ఎఎంసి డైరెక్టర్ బిక్షాలురెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు ఒగులూరు రామాంజి, జనమాల పిచ్చయ్య, పాలపోగు డగ్లస్, జాన్, ఫిలిప్‌రాజు పాల్గొన్నారు. **కొనకనమిట్ల :** గొట్లగట్ల గ్రామంలో ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి, జడ్‌పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు, మండల ఉపాధ్యక్షులు మెట్టు వెంకటరెడ్డి, తహశీల్దారు ప్రసాద్‌రావు. ఎంపిడిఒ జనార్ధన్, ఎపిఎం కె. గోపాలకష్ణారెడ్డి, ఎపిఒ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. **వెలిగండ్ల :** సింగిల్‌విండో అధ్యక్షులు పొల్లా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సిఎం జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్‌ఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ప్రధాన కార్యదర్శి గంజి రవీంద్రారెడ్డి, వైసిపి యువ నాయకులు తాతపూడి నాని, గజ్జల నాగేశ్వరరావు, సర్పంచి గాలి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** ఎఎంసి మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి ఆధ్వర్యంలో సిఎం జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయ ఆవరణలో కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి చేదూరి విజయభాస్కర్, జిల్లా ప్రజా పరిషత్ కో ఆప్షన్ మెంబర్ సయ్యద్ షాబీర్



చీమకుర్తిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే, బూచేపల్లి

బాషా, సర్పంచి రామావత్ అరుణాబాయి, వైఎస్ఆర్ క్రీడా వికాస కేంద్ర అభివృద్ధి కమిటీ చైర్మన్ నర్రెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు. **పెద్దదోర్నాల :** వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో సిఎం జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి లతాబాయి, ఎంపిపి గుమ్మా పద్మజ, సర్పంచి చిత్తూరి హారిక, వైస్ ఎంపిపి ఉపాధ్యక్షుడు దర్శనం నాగయ్య, నాయకులు జోగి వెంకట నారాయణ పాల్గన్నారు. సర్పంచ్ చిత్తూరి హారిక ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. **పెద్దారవీడు :** సిఎం పుట్టిన రోజు వేడుకలను వైసిపి మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, ఎంపిపి బెజవాడ పెద్దగురవయ్య, జడ్‌పిటిసి ఏరువ చలమారెడ్డి ఆధ్వరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ బుజ్జి, ఎఎంసి వైస్ చైర్మన్ కాశయ్య, వైస్. ఎంపిపి గుండారెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి పాల్గొన్నారు. **టంగుటూరు :** ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. కొండపి రోడ్డులోని వైసిపి కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు రక్తదానం రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంబిసి కార్పొరేషన్ డైరెక్టర్ వెంకట్రావు, నాగేశ్వరస్వామి దేవస్థానం పాలకవర్గం చైర్మన్ గొల్లపూడి సునీత, వైసిపీ సీనియర్ నాయకులు బీనీడి ఉదయ్ కుమార్, సోమేపల్లి మురళీకష్ణ పాల్గొన్నారు. **తర్లుపాడు :** సిఎం జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సూరెడ్డి భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, సర్పంచి వేశపోగు వరాలు, కో ఆప్షన్ మెంబర్ షేక్ అక్బర్, సర్పంచుల సంఘం అధ్యక్షులు డి.పెద్దమస్తాన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. జడ్‌పిటిసి వెన్నా ఇందిరా హనుమారెడ్డి ఆధ్వర్యంలో సిఎం జన్మదిన వేడుకలను నిర్వహించారు. **పిసిపల్లి :** వైసిపి కార్యాలయంలో సిఎం జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ బొర్రారెడ్డి, ఎంపిపి అత్యాల జఘన్య, జడ్‌పిటిసి లక్ష్మీకాంతం ఓకేరెడ్డి, సర్పంచి తాల్లూరి మరియమ్మ, ఎంపిటిసిలు కొండారెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు. **జరుగుమల్లి :** ముఖ్య మంత్రి జగన్‌మోహనరెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బెల్లం నిర్మలా సత్యన్నారాయణ పాల్గొన్నారు. **గిద్దలూరు రూరల్ :** వైసిపి నాయకుడు పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. తొలుత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి గొట్టికె రాజేశ్వర్‌రెడ్డి, మానం వెంకట్‌రెడ్డి, బొర్రా కష్ణారెడ్డి, డాక్టర్ సిహెచ్.రంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మానం రమణారెడ్డి, ఆకవీడు శంకర్‌రెడ్డి, పల్లె సుధాకర్‌రెడ్డి, ఫిలిప్, బాషా పాల్గొన్నారు. **దొనకొండ :**



రక్తదానం చేస్తున్న వరికూటి

ఎంపిపి బొరిగొర్ల ఉషామురళీ ఆధ్వర్యంలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా కేక్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి ఎం.సుధాకర్, గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచి కొంగలేటి గ్రేస్‌కుమారి దేవానంద్, కోఆప్షన్ షేక్.గఫార్, పాతకోట కోటిరెడ్డి పాల్గొన్నారు. వైసిపి కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సిఎం జన్మదిన వేడుకలు నిర్వహించారు. **పొదిలి :** ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా జూనియర్ కళాశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి, కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసుల రెడ్డి, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, పొదిలి, కెకెమిట్ల మండల కన్వీనర్లు దుగ్గెంపూడి శ్రీనివాస రెడ్డి, మోరా శంకర్ రెడ్డి, నగర పంచాయతీ అధ్యక్షురాలు నూర్జహాన్ బేగం, నాయకులు గుజ్జుల రమణారెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, శ్రీను, సంజీవరెడ్డి, ఏడుకొండలు పాల్గొన్నారు. **హనుమంతునిపాడు :** ఎంపిపి గాయం సావిత్రి ఆధ్వర్యంలో సిఎం జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ యక్కంటి శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు కొదమల బెంజిమెన్, శోభ,యూత్ అధ్యక్షుడు భవనం కష్ణారెడ్డి,ఆదినారాయణ రెడ్డి, ఎస్‌సి సెల్ నాయకులు గురు ప్రసాద్,బిసి నాయకులు మద్ది తిరపతయ్య, సర్పంచులు ఆలా శివ, కత్తి రాజారావు, కొటికల లింగేశ్వరరావు, పాల్గొన్నారు **నాగులుప్పలపాడు :** ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఎంపిపి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సుధాకర్‌బాబు, ఎంపిపి నలమలపు అంజమ్మ కష్ణారెడ్డి దంపతులు కేక్ కట్ చేశారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు పొద పవన్ ,అనూరాధ, వైసిపి నాయకులు పి. శ్రీమన్నారాయణ, పోలినేని కోటయ్య, పొట్టేటి అశోక్ ,పి. చెన్నకెశవులు, మాదాసు రాంబాబు, పెంట్యాల శ్రీను, మద్దిసాని నాగేశ్వరరావు, పి. నాగేశ్వరావు, జెట్టి శ్రీను పాల్గొన్నారు. నాగులుప్పలపాడు సచివాలయంలో ఎఎంసి చైర్మన్ మారెళ్ళ బంగారుబాబు, సర్పంచి హెప్సీరాణి కేక్ కట్ చేశారు. **సంతనూతలపాడు రూరల్ :** ముఖ్యమంత్రి పుట్టినరోజు సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే సుధాకర్‌బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, తహశీల్దారు శీలం శ్రీనివాసరావు, ఎంపిడిఒ ప్రసాద్, ఎంఇఒ సనత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. **మద్దిపాడు :** ఎంపిపి వాకా అరుణ కోటి ఆధ్వర్యంలో సిపిఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. .**గిద్దలూరు :** స్థానిక వైసిపి కార్యాలయంలో ముఖ్యమంత్రి మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజక వర్గ పరిశీలకులు బంగారు శీనయ్య, నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, వైస్ చైర్మన్లు ఆర్‌డి రామకష్ణ, కతా దీపికా, మాజీ ఎంపీపీ కడప వంశీధర్ రెడ్డి, అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ యాప్ నరసింహ రావు, కో ఆప్షన్ సభ్యులు షేక్ మస్తాన్ వలి పాల్గొన్నారు. **చీమకుర్తి :** ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పుట్టినరోజు సందర్భంగా బూచేపల్లి కల్యాణమండపం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టిజెఆర్. సుధాకరబాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లిశివ ప్రసాదరెడ్డి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, మండల వైసిపి కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, వైసిపి నాయకులు చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, చిన్నపురెడ్డి వెంకటరెడ్డి,క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మాల కొండయ్య, ఓబులరెడ్డి ,కౌన్సిలర్లు పాల్గొన్నారు. **కనిగిరి :** సిఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను స్థానిక పవిత్ర పంక్షన్ హాలులో రాష్ట్ర రెడ్డి కార్పోరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం మెగారక్తదాన శిబిరం, ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పేదలకు దుస్తులు, పండ్లు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మూలె గోపాల్‌రెడ్డి, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి,ఏరువారిపల్లి సర్పంచి వెంకటయ్య పాల్గొన్నారు.



మార్కాపురంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి



దర్శిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వేణుగోపాల్

నష్టపోయిన పొగాకు రైతులను ఆదుకోవాలి

రుణాల రీషెడ్యూల్ చేసి వడ్డీ లేని రుణాలివ్వాలి ● 24న ఆర్ఎం ఆఫీస్ వద్దకు రాయబారం: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మాండూస్ తుఫాన్‌తో పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని వెంటనే ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు, ఉపాధ్యక్షులు ఎస్‌కె మాబు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి బాలకోటయ్య, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 60 వేల ఎకరాలు పొగాకు పంట తీవ్రంగా దెబ్బతిందని, అకాల వర్షాలతో పొగాకు రైతులు నష్టపోయారని, వారిని



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

వెంటనే ఆదుకోవాలని కోరారు. ఈనెల 24న పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ కార్యాలయం కార్యక్రమంలో రైతులు ఎక్కువగా పాల్గొనాలని కోరారు. దెబ్బతిన్న పొగాకు వెంటనే నమోదు చేసి ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం ఇవ్వాలని, రుణాలు రీషెడ్యూల్ చేసి పంట వేసుకోవటానికి వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని అన్నారు. వాతావరణ బీమాను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎప్పుడూ లేనివిధంగా నేడు వర్షాలు వారం రోజులు పడటంతో పొగాకుతో పాటు శనగ, మిర్చి, కంది పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఈ పంటల నమోదు చేసి నష్టపరిహారం ఇవ్వటం ద్వారా రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.


ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న 96 డీఎస్సీ బ్యాచ్ టీచర్లు

రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-చెరుకుపల్లి: డిఎస్సీ 1998 క్వాలిఫైడ్ ఉపాధ్యాయు లకు పోస్టులు కేటాయించిన విధంగానే తమకు కూడా పోస్టులు కేటాయించాలని 1996 డిఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు సిఎం జగన్‌కు విజ్ఞప్తి చేశారు. సీఎం జగన్ పుట్టినరోజు సందర్భంగా చెరుకుపల్లి మండల పరిధిలోని గుళ్లపల్లిలోని ఈఎస్ఆర్ హాస్పిటల్‌లో వారు చెరుకుపల్లికి చెందిన వైసిపి నాయకులు బండారు రామారావు ఆధ్వర్యంలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 96 డిఎస్‌సి క్వాలిఫైడ్ అభ్యర్థులు జాన్ డానియల్, సోమరౌత్ సుబ్బారావు, పుప్పాల నాగేశ్వరరావు, ఏవి కృష్ణారావు, ఓరుగంటి జనార్ధన్ పాల్గొన్నారు.

23న పట్టణ వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-ఒంగోలు: ఈ నెల 23న రైతు దినోత్సవం సందర్భంగా స్థానిక లాయరుపేటలోని ఫ్రీడమ్‌బర్డ్స్‌లో విద్యార్థులకు, తల్లిదండ్రుల కు 'పట్టణ వ్యవసాయం.. ఇంటి పంటల పెంపకం'పై అవగాహన నిర్వహించనున్నట్లు డైరెక్టర్లు పుష్పేశ్వరి, మాల్యాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఉచితంగా విత్తనాలు, మొక్కల పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. అవగాహన కార్యక్రమానికి హాజరుకాదలచిన వారు 9848605205, 9502316215 నెంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.


సిఎంతో ఆమంచి

వైసీపీ పర్చూరు ఇన్‌ఛార్జిగా 'ఆమంచి'?

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా: బాపట్ల జిల్లా యడ్లపల్లి గ్రామ పర్యటనకు వచ్చిన వైసీపీ అధినేత జగన్ పర్చూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జిగా చీరాల మాజీ ఎమ్మెల్యే అమంచి కృష్ణమోహన్‌ను ఖరారు చేసినట్లు పర్చూరు వైసీపీ నేతలకు చెప్పారు. బుధవారం హెలిపాడ్ వద్ద తనను కలిసిన ప్రస్తుత పర్చూరు వైసీపీ ఇంచార్జి రావి రామనాథం బాబు ఇతర పర్చూరు వైసీపీ నేతలతో జగన్ ఈ విషయమై మాట్లాడారు. అమంచి పర్చూరు పార్టీ ఇన్‌ఛార్జిగా వస్తున్నారని, అక్కడ అందరూ కలిసి పనిచేయాలని స్పష్టం చేశారు. ఈసారి ఎన్నికల్లో పర్చూరులో వైసీపీ గెలవాలని, ఇందుకోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని జగన్ చెప్పారు. కాగా దాదాపు మూడు నెలలుగా ఎక్కడ బహిరంగ కార్యక్రమాలలో పాల్గొనని ఆమంచి బుధవారం యడ్లపల్లిలో జరిగిన సీఎం సభలో పాల్గొన్నారు. హెలిపాడ్ వద్ద సీఎంని కలిసి బొకే అందజేశారు. విద్యార్థులకు ట్యాబుల అందజేత సభలో పాల్గొన్నారు. ఆమంచి పర్చూరు రాకను వ్యతిరేకస్తున్న వైసీపీ నేతలు, ప్రజా ప్రతినిధులు జగన్ తీసుకున్న నిర్ణయం విషయమై బుధవారం రాత్రి సమాలోచనలు ప్రారంభించారు. పర్చూరు ఇన్‌ఛార్జిగా ఆమంచిని ఖరారు చేసినట్లు మంగళవారం దరిశి వచ్చిన సమయంలోనే జగన్ పార్టీ నేతలు, పర్చూరు పార్టి ఇన్‌ఛార్జీ రామనాథం బాబుకు చెప్పినట్లు తెలిసింది. యడ్లపల్లిలో మాత్రం హెలిపాడ్ వద్ద అక్కడికి వచ్చిన పర్చూరు నేతలతో ఓపెన్‌గానే చెప్పడంతో ఈ అంశం బయటకు వచ్చింది. కాని ఇటు చీరాలలో కాని, అటు పర్చూరులో కాని వైసిపిలో ఉన్న ఆమంచి అనుచరులు పార్టి అధినేత జగన్ పర్చూరు ఇన్‌ఛార్జి విషయం గురించి స్పష్టం చేసినప్పటికీ మౌనంగా ఉండిపోయారు. ఎలాంటి హడావుడి చేయలేదు.

నమ్మకానికి మారుపేరు ఎల్ఐసి

మార్కెటింగ్ మేనేజర్ శ్రీనివాస్

ప్రజాశక్తి-కనిగిరి

పెట్టుబడులకు, నమ్మకానికి మారుపేరుగా ఎల్ఐసి ఉందని నెల్లూరు డివిజన్ మార్కెటింగ్ మేనేజర్ పి శ్రీనివాస్ అన్నారు. బుధవారం సాయంత్రం కనిగిరి శాటిలైట్ మేనేజర్ పివిసిహెచ్ సుబ్బయ్య అధ్యక్షతన ఏజెంట్ల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నెల్లూరు డివిజన్ మార్కెటింగ్ మేనేజర్ పి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో ఆర్థిక రంగ సంస్థలలో ఎల్ఐసి నెంబర్-1గా ఉందని అన్నారు. అన్ని వయస్సుల వారికి ఉపయోగపడే పాలసీలు ఉన్నాయన్నారు. కనిగిరి శాటిలైట్ కార్యాలయం దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. ఈ సంవత్సరం కూడా కనిగిరిని అగ్రభాగంలో నిలపాలని కోరారు. మారుతున్న పరిస్తితులకు అనుగుణంగా అన్ని వర్గాల వారికి పాలసీలు అవసరమన్నారు. ఏజెంట్లు విరివిగా పాలసీలను అమ్మి పాలసీదారుల కుటుంబాలకు రక్షణగా


మాట్లాడుతున్న మార్కెటింగ్ మేనేజర్ శ్రీనివాసరావు

ఎల్ఐసిని నిలపాలన్నారు. అన్ని సంస్థల కన్నా అధిక వడ్డీ ఎల్ఐసిలోనే వస్తుందని అన్నారు. ప్రొడక్టు మేనేజర్ వంశీమోహన్ అన్నీ రకాల పాలసీలను గురించి వివరించారు. ఈ సమావేశంలో ఎఓ టి వెంకటేశ్వరరావు, ఎఓఐ నాయకులు సిహెచ్‌వి నారాయణ, ఆర్ సుబ్బరాయుడు, కైపు వెంకటేశ్వరరెడ్డి, సీనియర్ ఏజెంట్ ఎం హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల రిలే నిరాహారదీక్ష

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లు గ్రామ పంచాయతీ కార్మికులకు 5 నెలల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సిఐటియు మండల కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు కార్మికులకు మద్దతు ప్రకటించి దీక్షలను ప్రారంభించారు. ముఖ్యమంత్రి పుట్టినరోజు జరుపుకుంటున్న నాయకులు, అధికారులు మాత్రం జీతాల విషయంలో పట్టించుకోవటం లేదని సిఐటియు జిల్లా నాయకులు జి ప్రతాప్ కుమార్ విమర్శించారు. ముఖ్యమంత్రి పుట్టినరోజు మేజర్ పంచాయతీలో రోడ్లపైనే చెత్త పేరుకుపోవటం దారుణమని అన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి కార్మికులు విధులు నిర్వర్తిస్తుంటే కొత్తగా వచ్చిన సర్పంచ్‌లు, ఇఓలు కొంతమంది రాజకీయ నాయకులు వారిపై పెత్తనం చేయటం దుర్మార్గమని అన్నారు. కొంతమంది కార్మికులు నాయకులకు తొత్తులుగా వ్యవహరించటం దారుణమన్నారు. అధికారులు దిగివచ్చి జీతాలు చెల్లించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గ్రామానికి చెందిన ఉప్పలపాటి రమేష్‌రాజు కార్మికులకు మద్దతు ప్రకటించి వెయ్యి రూపాయలు ఆర్థిక సాయం అందించారు. నిరాహారదీక్షలో నల్లపు రంగారావు, సత్యానందం బాబు, రాఘవేంద్రరావు, కోటేశ్వరరావు, పోలయ్య, బుజ్జి, జ్ఞానమ్మ, సుబ్బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.



నిరాహారదీక్ష చేస్తున్న కార్మికులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అడవులు, పర్యావరణ పరిరక్షణను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని యర్రగొండపాలెం అటవీ క్షేత్రాధికారి నీలకంఠేశ్వరరెడ్డి తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నీలకంఠేశ్వరరెడ్డి మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి పౌరులన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు మొక్కలను నాటి వాటిని పరిరక్షించాలని సూచించారు. అనతరం విద్యార్థులకు టీ షర్టులు, టోపీలు అంజదేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల జడ్‌పిటిసిలు చేదూరి విజయభాస్కర్, వాగ్యా నాయక్, సర్పంచి రామావత్ అరుణాబాయి, ఎంఇఒ ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మయ్య, ఎన్‌సిసి మాస్టర్ సత్యనారాయణ, డిప్యూటీ ఫారెస్టు రేంజర్ శ్రీనివాసులు, పుల్లలచెరువు డిప్యూటీ రేంజర్ రాంమోహన్, కొలుకుల సెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, అటవీ బీట్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

మానవత్వాన్ని చాటుకున్న సీఎం వైఎస్ జగన్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా చుండూరు మండలం యడ్లపల్లిలో ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం అనంతరం తిరుగు ప్రయాణంలో సీఎంని కలిసి తమ ఇబ్బందులు వివరించిన మోదుకూరు గ్రామానికి చెందిన గుండ్రెడ్డి వెంకటరెడ్డి, వలివేరు గ్రామానికి చెందిన కూచిపూడి విద్యాసాగర్ సమస్యపై వెంటనే స్పందించిన సీఎం, ప్రభుత్వం తరపున తక్షణ సహాయం చేసి మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ మేరకు బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ముఖ్యమంత్రి ఆదేశాలతో వెంటనే ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున దివ్యాంగులకు చెక్కులు అందజేశారు. మోదుకూరు గ్రామానికి చెందిన గుండ్రెడ్డి వెంకటరెడ్డి తన కుమారుడు, కుమార్తె పుట్టుకతోనే మానసిక వైకల్యంతో బాధపడుతున్నారని, ఆరు ఎకరాల భూమిని సాగుచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఐదు ఎకరాలకు మించి భూమి ఉంటే పించన్ రాదనే నిబంధన ఉండడంతో వారికి ఆ విషయం తెలిపిన సీఎం, ఆ కుటుంబానికి తక్షణమే ఆర్థిక సాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. వలివేరు గ్రామానికి చెందిన కూచిపూడి విద్యాసాగర్ భవనం నిర్మిస్తూ ప్రమాదవశాత్తూ మూడంతస్తుల నుంచి కిందపడి వికలాంగుడినై, కుటుంబాన్ని పోషించుకోలేకపోతున్నట్లు సీఎంకు వివరించారు. స్పందించిన ముఖ్యమంత్రి జగన్.. విద్యాసాగర్ కుటుంబానికి కూడా తక్షణమే ఆర్థిక సాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. సీఎం స్పందనతో బాధిత కుటుంబాలు సంతోషాన్ని వ్యక్తం చేశాయి. తమ సమస్యపై ఇంత త్వరగా ముఖ్యమంత్రి స్పందించడం, వెంటనే తమకు సాయం చేయడం ఎన్నడూ మరువలేమని వారు తమ ఆనందాన్ని జిల్లా కలెక్టర్‌తో పంచుకున్నారు.

తెలుగు రచయితల మహాసభలకు ఆహ్వానం

ప్రజాశక్తి-అద్దంకి

అయిదవ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు అద్దంకి వాసులకు ఆహ్వానం పలికారు. ఈ నెల 23, 24 తేదీలలో విజయవాడ పిబి సిద్ధార్థ ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో 5వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు కృష్ణా జిల్లా రచయితల సంఘం, తానా, ప్రపంచ సాహిత్య వేదిక, సిలికానాంధ్ర వారి ఆధ్వర్యాన, సిద్ధార్థ అకాడమీ, విజయవాడ వారి సౌజన్యంతో జరుగుతున్నాయి. 5వ మహాసభలు మారుతున్న పరిస్థితులలో రచయితల పాత్ర అనే లక్ష్యంగా జరగనున్నాయి. ఈ సభలకు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, నూతలపాటి వెంకటరమణ, డాక్టర్ మండలి బుద్ధప్రసాదు, డాక్టర్ కెవి రమణాచారి (విశ్రాంత), గరికపాటి నర్సింహారావు, సినీ గేయ రచయిత భువనచంద్ర, ఆచార్య కొలకలూరి ఇనాక్, లావు అంజయ్య చౌదరి, తానా అధ్యక్షులు, డాక్టర్ ప్రసాద్ తోటకూర, కూచిభొట్ల ఆనంద్, సిలికానాంధ్ర వ్యవస్థాపకులు, గజల్ శ్రీనివాస్, గుత్తికొండ సుబ్బారావు, డాక్టర్ జివి పూర్ణచందులు, ప్రముఖులు పాల్గొంటున్నారు. ఈ సభలకు సృజన సంస్థ ప్రతినిధి పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తికి సమన్వయకర్తగా ఆహ్వానం అందింది. ఈ సభలకు సారథ్య సంఘ సభ్యులుగా నున్న పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తిని సభామిత్ర పురస్కారంతో సత్కరించనున్నారు. ఈ సభలకు ప్రతినిధులుగా అద్దంకి నుంచి డివిఎం సత్యనారాయణ, గాడేపల్లి దివాకర దత్తు, పాలపర్తి జ్యోతిష్మతి, కె అనిలకుమారసూరి, అద్దంకి లేవిప్రసాదు, డి జయలక్ష్మి పాల్గొంటున్నారని తెలిపారు.


పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి

తలసేమియా బాధితురాలి

తక్షణ చికిత్సకు సాయం

రూ.లక్ష చెక్కు అందజేసిన కలెక్టర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

తలసేమియా వ్యాధితో బాధపడుతున్న బాలిక శాన్విక తక్షణ వైద్య అవసరాల కోసం కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ లక్ష రూపాయల చెక్కును బుధవారం ఆమె తల్లి నిషిత కుమారికి అందించారు. 8 ఏళ్ల తన బిడ్డ పరిస్థితిని నిషిత కుమారి మంగళవారం దర్శి పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి వివరించారు. నెలకు రెండుసార్లు రక్తమార్పిడి చేయించాల్సి వస్తోందని, దీనికి 12 వేల రూపాయలకు పైగా ఖర్చు అవుతుందని చెప్పారు. బోన్ మ్యారో శస్త్ర చికిత్సకు సుమారు 30 లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారని, తమ కుటుంబానికి సహాయం చేయాలని ఆమె ముఖ్యమంత్రిని కోరారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, పూర్తిస్థాయి సహాయం చేస్తామని ముఖ్యమంత్రి ఆమెకు హామీ ఇచ్చారు. తక్షణ వైద్య అవసరాల కోసం ఆర్థిక సహాయం చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ నేపథ్యంలో బిడ్డతో సహ బుధవారం ఒంగోలు కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన నిశత కుమారికి కలెక్టర్ లక్ష రూపాయల విలువైన చెక్కును అందించారు. పూర్తిస్థాయి వైద్య చికిత్సకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మరింత సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని ఆమెకు భరోసా ఇచ్చారు.

నాణ్యమైన విద్య అందించేందుకు కృషి

కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలలో చదువుకుంటున్న వారికి నాణ్యమైన విద్య అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సబ్జెక్టుతో కూడిన ట్యాబ్‌ల పంపిణీ రాష్ట్రస్థాయి కార్యక్రమం బుధవారం బాపట్ల జిల్లా చుండూరు మండలం ఎడ్లపల్లిలో జరిగింది. దీనికి అనుబంధంగా జిల్లాస్థాయి కార్యక్రమం ప్రకాశం భవనంలోని స్పందన హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలోని పాఠశాలలకు తగినట్లుగా సబ్జెక్టులతో కూడిన ట్యాబ్‌ల పంపిణీ చేపట్టడమే దీనికి నిదర్శనమన్నారు. ఈ క్రమంలో జిల్లాలో 25 వేలకు పైగా ట్యాబ్‌లు పంపిణీ చేయబోతున్నామని తెలిపారు. వీటిలో 2200 పైగా ట్యాబులను ఉపాధ్యాయులకు ఇవ్వగా, మిగతావి విద్యార్థులకు పంపిణీ చేస్తామని వివరించారు. గురువారం నుంచి మండల స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి ప్రజాప్రతినిధుల సమక్షంలో వీటిని పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఒక్కో ట్యాబ్ ఖరీదు రూ.16


ట్యాబులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

వేలకు పైగా ఉందని, దీనికి అదనంగా రూ. 15 వేలకు పైగా విలువైన సబ్జెక్టు కంటెంట్ ను వీటిలో నిక్షిప్తం చేసి పూర్తి ఉచితంగా విద్యార్థులకు పంపిణీ చేయబోతున్నామన్నారు. ఇప్పటికే అమ్మఒడి, విద్యా కానుక, పాఠశాలలలో నాడు - నేడు కార్యక్రమాలతో విద్యారంగ అభివద్ధికి చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం, ఈ పోటీ ప్రపంచంలో విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి ఉపయోగపడేలా తెలుగు - ఇంగ్లీషు భాషలతో కూడిన పాఠ్యాంశాలను నిక్షిప్తం చేసి ట్యాబ్‌లను కూడా పంపిణీ చేసేలా నిర్ణయం తీసుకుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, జిల్లా విద్యాశాఖ అధికారి బి. విజయభాస్కర్ పాల్గొన్నారు.

సిఎం పుట్టినరోజు సందర్భంగా

ఉచితంగా వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కార్పొరేటర్ డాకా సుజాత ఆధ్వర్యంలో స్థానిక రంగారాయుడు చెరువు కట్టపై బుధవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు. వైసిపి జిల్లా కార్యాలయంలో బిసిసెల్ జిల్లా అధ్యక్షుడు కటారి శంకర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. మాతా శిశువైద్యశాలలో వైసిపి నాయకురాలు సాధం విజయలక్ష్మి, జాజుల కృష్ణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. రిమ్స్ వైద్యశాలకు సూర్యబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాసరి కరుణాకర్, డాక్టర్ షాకీర్ ఆధ్వర్యంలో 100


వైద్యపరీక్షలు చేయించుకుంటున్న బాలినేని

పిపిఇ కిట్లు అందజేశారు. బొమ్మరిల్లు ఆశ్రమానికి రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మహబూబ్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు అందజేశారు. మేదర కార్పొరేషన్ చైర్మన్ కేతా లలిత నాంచరమ్మ ఆధ్వర్యంలో బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ వద్ద కేక్ కట్ చేసి పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్పొరేటర్ గోపిరెడ్డి గోపాలరెడ్డి ఆధ్వర్యంలో ఉమా మనోవికాస కేంద్రంలో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు.

మత సామరస్య సంస్కృతిని కాపాడుకోవాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి

ప్రజాశక్తి-ఒంగోలు

విదేశీ విష సంస్కృతి ప్రమాదం నుండి మత సామరస్య వాదంతో కూడిన భారతీయ సంస్కతి, సాంప్రదాయాలను కాపాడుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపునిచ్చారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షమ్మీ అధ్యక్షతన బుధవారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో రమాదేవి మాట్లాడుతూ విదేశీ విష సంస్కతి బీజాలు దేశమంతా విస్తరిస్తున్నాయని, అవి ప్రజల జీవితాలను విచ్ఛిన్నం వైపు మళ్ళిస్తున్నాయన్నారు. విదేశీ విష సంస్కతితో మహిళల జీవితాలు అభద్రతలోకి పోతున్నాయన్నారు. ఇందుకు తోడు అనేక మతాలు, జాతులు, భాషలు, సంస్కతులు కలిగిన భారతదేశం సర్వ మానవ సమతా భావాన్ని తరతరాల వారసత్వంగా కలిగి ఉందన్నారు. ఈ భావాలకు, సాంప్రదాయాలకు ప్రమాదకరంగా నేడు కేంద్రంలో ఉన్న ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న దుష్ట విధానాల ఫలితంగా పరిశ్రమల మూత, నిరుద్యోగం, అధిక ధరలు, ఆకలి చావులు, ఆత్మహత్యలు, సంపద కేంద్రీకరణ, అసమానతలు పెరుగుతున్న స్థితిలో ప్రజలు ఉద్యమాల్లోకి వస్తున్నారని తెలిపారు. పాలకుల విధానాలను ప్రతిఘటించేందుకు మహిళలు కూడా పెద్ద సంఖ్యలో కదులుతున్నారన్నారు. ఇటువంటి ప్రజా ఉద్యమాలను పక్కదారి పట్టించేందుకు పాలకులు మత ఉన్మాద చర్యలను రెచ్చగొడుతున్నారని, కలిసి ఉన్న ప్రజల మధ్య కల్లోలం సృష్టిస్తున్నారని అన్నారు. విష సంస్కతికి, మతోన్మాదానికి మహిళలు అత్యధికంగా గురవుతున్నారన్నారు. ఈ


మాట్లాడుతున్న కంకణాల రమాదేవి

ప్రమాదం నుంచి దేశాన్ని కాపాడుకునేందుకు మన సంప్రదాయ పండుగల సందర్భంగా ప్రజలలో సామరస్య భావాలు, లౌకిక సంప్రదాయాలు, ప్రగతి దాయకమైన భారతీయ సాంస్కతిక వారసత్వాన్ని కొనసాగించేందుకు కషి సాగించాలని ఆమె పిలుపు నిచ్చారు. సంక్రాంతి, క్రిస్టమస్ సందర్భంగా క్రీడా సాంస్కతిక కార్యక్రమాలు విస్తతంగా నిర్వహించాలని, ప్రజల్ని భాగస్వాములు చేయాలన్నారు. సామరస్య భావాలు ప్రజల్లో పెంపొందించేందుకు కషి చేయాలని ఆమె కోరారు. సమావేశంలో ఐద్వా జిల్లా నాయకులు గంగవరపు ఆదిలక్ష్మి, కె రాజేశ్వరి, కె. లక్ష్మీ ప్రసన్న, ఆళ్ల. సీతామహాలక్ష్మి, బి .రాజ్యలక్ష్మి, షేక్ బషీర, బి.భానుమతి, యస్.డి. ఖాదరున్నీస్సా, బి.ప్రేమలత, జి. కళ్యాణి, బత్తుల.రంగమ్మ, బి. గోవిందమ్మ, కె.విజయలక్ష్మి, పి.రత్నం, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలే లక్ష్యం

ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదాంసాహెబ్

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ఆర్టీసీని లాభాల బాటలో నడిపించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె ఆదాంసాహెబ్ అన్నారు. బుధవారం సాయంత్రం మార్కాపురం ఆర్‌టిసి డిపో, బస్టాండ్‌ను ఆయన సందర్శించారు. సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నెల్లూరు జోన్ పరిధిలోని పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలలోని 27 డిపోల్లో 2200 బస్సులు, 11,600 మంది ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. రోజుకు 9 లక్షల కిలోమీటర్లు ప్రయాణికులను ఆర్‌టిసి గమ్యస్థానాలకు చేరవేస్తుందని పేర్కొన్నారు. దీని ద్వారా రోజుకు 3 కోట్ల 25 లక్షల రూపాయల ఆదాయం వస్తోందని తెలిపారు. 5 జిల్లాల్లో 144 మండలాలు 2,563 గ్రామాల్లో ప్రైవేటు మరియు ఆర్టీసీ బస్సులు సేవలందిస్తున్నాయన్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా 5 జిల్లాల వ్యాప్తంగా సుమారు 500 మేర ప్రత్యేక బస్సు సర్వీసలకు


బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆదాంసాహెబ్

ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొని రావటం జరుగుతుందన్నారు. అలాగే త్వరలో మరిన్ని ఎక్స్‌ప్రెస్ సర్వీసులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం ఈడీ ఆదాంసాహెబ్‌ను డిపోలోని యూనియన్ నాయకులు ఘనంగా సత్కరించారు. డిపోల్లో సమస్యలను సాధ్యమైనంత త్వరలో పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలోజిల్లా ప్రజా రవాణా అధికారి బి. సుధాకర్, మార్కాపురం డిపో మేనేజర్ నరసింహులు, సూపరింటెండెంట్ కామేశ్వరి పాల్గొన్నారు.



సిఎంకు పుట్టినరోజు శుభాకాంక్షలు

తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి.. పుష్పగుచ్ఛం అందజేసి.. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న ఒంగోలు ఎమ్మెల్యే, రీజనల్ కోఆర్డినేటర్ బాలినేన శ్రీనివాసరెడ్డి

- ప్రజాశక్తి, ఒంగోలు

'మార్ట్'తో మహిళలకు ఆర్థిక చేయూత

కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-టంగుటూరు

చేయూత మహిళ మార్ట్ తో మహిళలకు ఎంతో ఆర్థిక చేయూత లభిస్తుందని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్ట్ ను కలెక్టర్, పలువురు జిల్లా అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోనే తొలిసారిగా టంగుటూరులో చేయూత మహిళ మార్ట్ ను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ మహిళా మార్ట్ లో తక్కువ ధరలకే నాణ్యమైన వస్తువులు లభిస్తాయని, మండలంలోని మహిళ లందరి భాగస్వామ్యంతోనే మార్ట్ ఇంత త్వరగా ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మహిళా మార్ట్ త్వరగా ప్రారంభించేందుకు కారకులైన నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో నూతనంగా



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

నిర్మించిన హార్టికల్చర్ కలెక్షన్ సెంటర్ ను ప్రారంభించి రైతు ఉత్పత్తిదారులకు రుణ సహాయం కింద రూ30 లక్షలు చెక్కును కలెక్టర్ పంపిణీ చేశారు. వెలుగు ఏపీఎం బెజ్జం రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సెర్ప్ సీఈవో మహమ్మద్ ఇంతియాజ్, ఏపీఎంఐపి పిడి, డిఆర్ డిఏ పీడీ బడుగు బాబురావు, కొండపి నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ రాంబాబు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో ఎం సుభాషిణి, ఏఓ జి స్వర్ణలత, పలువురు మండల స్థాయి అధికారులు, వెలుగు సీసీలు, విఓఏలు, మండల మహిళా సమాఖ్య సభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

చేనేత వస్త్రాల విక్రయ కేంద్రం ప్రారంభం

ఒంగోలు: ఆప్కో ఆధ్వర్యంలో ఒంగోలులోని ది ఒంగోలు ఫ్యాన్సీ గూడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో ఏర్పాటుచేసిన మెగా చేనేత వస్త్రాల ప్రదర్శన, విక్రయ కేంద్రాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే నెల 15 వరకు విక్రయ కేంద్రం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.


చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్, మేయర్